'పోస్ట్' అన్న కేకతో పరుగున బయటకెళ్ళింది స్వర్ణ. లెటర్ తీసుకుని వచ్చి మెల్లిగా విప్పింది.

కథ

# అందగాడు

ప్రియమైన స్వర్ణకి,

ఈవారం 'వసుధ' పత్రికలో నీ కథ 'మంచుతెర' చదివాను. అందులో స్వర్ణపాత్రని చాలా బాగా మలిచావు. కథ అద్భుతంగా వుంది. శైలి ఉక్కిరిబిక్కిరి చేసింది. ముగింపు చదువుతూంటే కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అలాగే 'వెలుగు'లో నీవు వ్రాసిన 'యవనిక' కవిత చదువుతూంటే మనసంతా హాయిగా, చల్లగా మారిపోయింది. అందులోని భావుకత హృదయానికి హత్తుకుపోయింది. అభినందనలు. ఇలాగే సామాజిక స్పృహగల మరెన్నో రచనా సుమాలు నీ కలం నుండి ఉద్భవించాలని కోరుతున్నాను.

ఇట్లు

బావ

సురేంద్ర

''ఎక్కడి నుంచే లెటర్. బావనుంచేనా?'' ఆరాతీస్తూ అంది జానకమ్మ.

''ఊ'' అంది స్వర్ణ.

''ఏంటే అలా మెల్లిగా అంటావ్. ఏం రాశాడో చదువు''

''ఏం లేదు బామ్మా, మామూలే. నేను వ్రాసినవి నచ్చాయని రాశాడు'' అని చెప్పి ఉత్తరాన్ని ఉత్తరాల పెట్టెలో పడేసింది.

''అదేంటే అలా పడేశావ్? అన్ని ఉత్తరాలూ ఆ ఉత్తరం ఒక్కటేనా. బావ ఉత్తరాన్ని భద్రంగా దాచుకో. పెళ్ళయ్యాక చూపించి నీ అభిమానిని ఆటపట్టిద్దువుగానీ'' అంది జానకమ్మ.

ఆ మాటకు ఛెయిర్‌లో కూర్చుని పేపర్ చూస్తున్న సుదర్శనరావు ముసిముసిగా నవ్వుకున్నాడు. ఆ నవ్వు పక్కనే వున్న శారద కంట్లో పడనే పడింది.

''అలా నవ్వుకుంటూ కూర్చోవటమేనా, దాని పెళ్ళి గురించి ఆలోచనేమైనా వుందా? ఊరెళ్లి మీ అక్క, బావగారితో మాట్లాడి ముహూర్తాలు పెట్టుకునే ఏర్పాటు చూడండి'' గట్టిగా అంది శారదమ్మ.

''నాన్నా, నేను బావను చేసుకోను'' ఠక్కున అంది స్వర్ణ.

ఆ మాటకు అంతా ఉలిక్కిపడ్డారు. ఓ క్షణం ఎవరి నోటా మాట రాలేదు.

''కొంపదీసి ఎవరినన్నా ప్రేమించావా?'' అడిగింది జానకమ్మ.

''ఊహూ...''

''మరి నీకేం రోగం''

''బావను చేసుకోవటమిష్టం లేదు. వేరే సంబంధాలు చూడండి''

''వాడికేమయిందే లక్షణంగా ఉద్యోగముంది. బుద్ధిమంతుడు. నువ్వంటే ప్రాణమిస్తాడు. మనిషి నలుపేకానీ ఆకర్షణీయంగా వుంటాడు. ఏం తక్కువయిందనీ..'' అరిచినంత పనిచేసింది జానకమ్మ.

''ఏంటే..నువ్వేమంటున్నావే నీకర్థమవుతోందా! నువ్వు పుట్టినప్పుడే వాడికి పెళ్ళాం పుట్టిందని అంతా అనుకున్నాం. వాళ్ళూ ఇదే ఆలోచనలో వున్నారు. ఇప్పుడు నీకేమొచ్చింది?'' అంది శారదమ్మ.

''బావను చేసుకుంటానని నేనెప్పుడూ చెప్పలేదు. నాకిష్టం లేందటున్నాగా'' అంటూ లేచి గదిలోకెళ్లిపోయింది స్వర్ణ.

సదర్శనరావు గొంతు మూగబోయింది.

గదిలోకి నడిచింది శారదమ్మ.

★★★

''అమ్మో చెబుతూంటే అర్థం చేసుకోవేం? బావా..బావా..అంటావ్, నా ఇష్టంతో పనిలేదా? బావకు నామీద ప్రేమ వుండగానే సరిపోతుందా. ఈడూజోడూ అవసరం లేదా? నల్లవాడే..అందగాడే అని పాడుకోడానికిదేం సినిమాకాదు. కాకిముక్కుకు దొండపండులా అలాంటోడ్ని చేసుకుని నలుగురిలో తిరగటం నా వల్ల కాదు. నల్లవాడ్ని చేసుకోవాల్సిన ఖర్మేంటి?''

కూతురు మాట్లాడే ఒక్కోమాటా సుదర్శనరావు, శారదమ్మ గుండెల్లోకి దూసుకుపోసాగాయి.

సుదర్శనరావు నిశ్చేష్టుడయ్యాడు. శారదమ్మ గుడ్లనీరు కుక్కుకుంటూ వుండిపోయింది.

''వాడికేంటే, నల్లగా వుంటేనేం మా రాజులా వుంటాడు. కో..అంటే కోటిమంది చేసుకోవడానికొస్తారు. ఓ నాలుగు కథలు రాయగానే సరిపోదు. ఏం మాట్లాడుతున్నాననే జ్ఞానముండాలి'' గయ్యిమంది జానకమ్మ.

కూతురు మనసేంటో సుదర్శనరావుకు అర్థమయింది.

చేసేదేమీలేక మిన్నకుండిపోయాడు.

కూతురు ఇష్టప్రకారమే చేయటానికి నిర్ణయించుకున్నాడు.

సుదర్శనరావు చెప్పటంతో ఓ అయిదారు సంబంధాలు తీసుకొచ్చాడు పేరయ్య. వాళ్ళలో ఎర్రగా, బుర్రగా, రింగుల జుట్టుతో దొరబాబులా వున్న ఇంజనీర్ కుర్రాడ్ని సెలెక్ట్ చేసుకుంది స్వర్ణ.

అబ్బాయి పేరు శ్రీధర్.

ఒక్కతే కూతురు కావటంతో ఒంటినిండా బంగారం, కట్నమిచ్చి పెళ్ళి చేయటానికి ఒప్పుకున్నాడు సుదర్శనరావు.

ఆరోజు స్వర్ణ బర్త్‌డే.

శ్రీధర్‌ని ఇంటికి ఇన్వయిట్ చేసింది. తాను రచయిత్రినని సడెన్‌గా తెలియజేసి అతడ్ని ఆశ్చర్యంలో ముంచెత్తాలని స్వర్ణ మనసు తహతహలాడుతోంది. తను చెప్పకుండానే అతడు తెలుసుకోవాలని టీపాయ్ మీద తన కథలు, కవితలున్న మేగజైన్స్ వుంచింది.

అరగంటకుపైగా ఆలస్యం చేసిన తర్వాత గదిలోకి నడిచింది.

ఆమె ఊహించిన విధంగా మేగజైన్స్ తిరగేస్తూ లేడతను. ఎలా వున్న బుక్స్ అలాగే వున్నాయి.

రింగు రింగులుగా పొగవదులుతూ సిగరెట్ పీల్చుతున్నాడు. పక్కనే అంతవరకూ తాగిపడేసిన సిగరెట్ పీకలున్నాయి. గదంతా సిగరెట్ వాసన పరుచుకుని వుంది. ఆ వాసనకు కడుపులో త్రిప్పినట్లయింది.

''మేగజైన్స్ చూశారా?'' అంది.

''చూడలేదు. అలవాటు లేదు'' అన్నాడు.

''నేను కవితలు, కథలు వ్రాస్తుంటానండీ. వీటిలో నా రచనలున్నాయి. ఈమధ్యనే ప్రారంభించాను'' అంటూ చిరునవ్వుతో ఒకటొకటే తీసి చూపించింది.

'నీ కోసం'

'నా హృదయం'

'మల్లెల మాల'

కవితల టైటిల్స్ గట్టిగా చదివాడు.

అతని ప్రశంసకోసం ఆమె మనసు ఎదురుచూస్తోంది.

''ఆహా...చాలా ఘాటుగా వ్రాశావ్. ఎవరినన్నా ప్రేమించావా?'' నిమిషం తర్వాత అడిగాడు అనుమానంగా చూస్తూ.

ఆమె ఊహించని ప్రశ్న అది.

''ఊహూ''

''మరి ఎవడికోసం వ్రాశావ్?''

జల్లుమంది గుండె. మెదడు దిమ్మెరపోయింది.

''కాబోయే భర్త కోసం'' చెప్పింది.

''ఆహా..అలాగా! ఆ కథలిలా ఇవ్వు. సెక్స్ కథలు ఏమన్నా రాశావా?'' అడిగాడు.

చిగురుటాకులా ఆమె హృదయం వణికింది. తలలో వేయి జలపాతాల హోరు.

కథలున్న మేగజైన్స్ ఇచ్చింది. పరిశోధకుడు భూతద్దంలో చూసినట్లు ఒక్కో వాక్యం చదవసాగాడు.

''ఆ అమ్మాయి అతనికి తియ్యని ముద్దునిచ్చిందని వ్రాశావ్? ముద్దు అంత తియ్యగా వుంటుందని ఎలా తెలుసు? ఆమె అతని వెచ్చని ఒడిలో పులకరించిపోయింది..ఓహో శృంగారం కూడా బాగా వ్రాసేలా

వున్నావే'' నవ్వాడతను.

ఆ మాటలు అణుబాంబులా మారి ఆమె హృదయాన్ని తాకి బ్రహ్మాండమైన విస్ఫోటనాన్ని సృష్టించాయి. గుండెల్ని కోసేస్తూ బాధాకెరటం.

తన రచనల్లోని సామాజిక స్పృహను, భావుకతను ప్రశంసిస్తాడనుకుందే కాని ఇలాంటి సన్నివేశాల్ని ఊహించనైనా లేదు.

''అనుభవం లేకుండా వ్రాయటం సాధ్యమేనా?'' అడిగాడు కళ్ళలోకి చూస్తూ.

''రచయిత పురిటినొప్పుల గురించి వ్రాస్తే, ఆ నొప్పులు అనుభవించి వ్రాసాడంటారా? ఏం మాట్లాడుతున్నారు?'' తలొంచుకుని అంది.

''స్వర్ణా ఏం పర్వాలేదు. కాబోయే భార్యాభర్తల మధ్య దాపరికాలుండ కూడదు. నీ గత ప్రేమ, అనుభవాలూ నిరభ్యంతరంగా చెప్పు..నేనేం అనుకోనులే..'' అనునయంగా గోముఖవ్యాఘ్రంలా అడిగాడు.

అతని ఒక్కోమాట బుల్లెట్‌లా మారి ఆమె హృదయాన్ని తూట్లు పొడుస్తున్నాయి. ఆ మాటలకు ఆమె హృదయంలోని రక్తం నీరయి శ్వాస భారమయి-అవయవాల శక్తి నిర్వీర్యమైపోయింది. హృదయాన్ని శతసహస్ర బాణాలు తాకినా అంత బాధ వుండదేమో!

అతనేంటో అర్థమవుతోంటే ఒంటిమీద తేళ్ళూ, జెర్రులూ ప్రాకుతున్నట్లనిపించింది. ఈడ్చి ముఖం మీద కొట్టాలనిపించింది. నిభాయించుకుంది.

'ఎంత పిచ్చిది తను, అందంగా మిలమిలలాడుతోందని మేడిపండు లోతును చూడలేకపోయింది.'


అప్పుడు గుర్తొచ్చాడు ఆమెకు...బావ! నిజమైన అందమంటే ఏంటో అర్థమవసాగింది. తనపై తనకే కోపం..ఉక్రోషం.

బావ గుర్తొచ్చి గుండె కలుక్కుమంది.

తనంటే బావకు ఊపిరని..జీవమని..సర్వం తానేయని అన్నీ తెలుసు. అంతటి అనురాగాన్ని, అవధుల్లేని ఆప్యాయతను తిరస్కరించి కళ్ళు మూసుకుపోయి పైపై మెరుగు చూసి భ్రమపడింది. అన్నీ తెలిసీ మూర్ఖురాలైంది.

బావ నిష్కళంకమైన ప్రేమ, స్వచ్ఛమైన హృదయం, అభిమానంతో నిండిన చల్లని చూపులు కళ్ళముందు కదిలాయి.

చిన్ననాటి జ్ఞాపకాలే గుర్తొచ్చాయో..లేక బావ పెళ్ళిలో తనవైపు చూసిన చూపే మనసును కదిల్చిందో ఆమె కళ్ళనిండా నీళ్ళు. బావ కాళ్ళు కన్నీళ్ళతో కడిగి క్షమాపణ కోరాలనుంది.



గుండెల్ని కుదిపేస్తూ దుఃఖపు తెర మనసును నొక్కిపట్టినా ఆగని కన్నీళ్ళు.

''స్వర్ణ'' పిలిచాడతను. పలుకలేదు.

''ఏంటలా అయిపోయావు. ఉన్నమాటేగా నేనంది. ఇలాంటివన్నీ నాకు గిట్టవు. పత్రికలకు ఫోటోలివ్వటం, అడ్రస్‌లివ్వటం, అడ్డమైన వాళ్ళంతా లెటర్లు వ్రాయటం, నిన్ను ప్రశంసించడం...నో..నాకిష్టం లేదు. జరిగిందేదో జరిగిపోయింది. ఇకముందు ఈ పిచ్చి పిచ్చి రాతలు మానుకో..లేదంటే..''

''లేదంటే ఏం చేస్తారు? చేసిన నిర్వాకం చాలు. ఛీ..నీ ముఖం నాకు చూపించకు'' సంధించిన బాణంలా బయటకు దూసుకెళ్ళింది. అతను ఊహించని సంఘటన అది.

అప్పటికే ఆ సంభాషణ విన్న సుదర్శనరావు, శారదమ్మ, జానకమ్మ, వర్ధనమ్మ, రంగారావు నివ్వెరపోయారు. అలాంటి వాడితో పెళ్ళీ సంసారమంటే పడగనీడని అందరికీ అర్థమయిపోయింది. ''ఛీ..ఛా'' అన్నారు.

''నేను బావను చేసుకుంటా నాన్న, నేనిప్పుడే బావను చూడాలి''

వెక్కి వెక్కి ఏడుస్తోందామె. సుదర్శనరావుగారు మౌనంగా వుండిపోయారు.

''నా మనవడు మన మాటెప్పుడూ కాదనడు. తెల్లారేసరికి రెక్కలు కట్టుకు వాలుతాడు. ఏడవకు. క్షమించరానంత తప్పు నువ్వేం చేశావ్?'' అంటూ జానకమ్మ స్వర్ణ తలమీద ప్రేమగా నిమిరి ఫోన్ వైపు నడిచింది.

★

**డి.కె.చదువులబాబు**